సాక్షి విశాఖపట్నం

శనివారం । 15 । జూన్ । 2024



క్యాన్సర్ విజేతలకు అభినందన 8లో



ఏయూలో అమెరికన్ ఎంబసీ అధికారులు 8లో



కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్య హోమం 8లో

న్యూస్‌రీల్

కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున

గోపాలపట్నం: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఎంపీ భరత్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మెగా జాబ్‌మేళాలో 160 మంది ఎంపిక



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్క్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. సుమారు 13 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో 417 ఉద్యోగ ఖాళీల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 228 మంది అభ్యర్థులు హాజరైతే 160 మంది ఎంపికైనట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ ఉపాధి అధికారి సీహెచ్ కుమారస్వామి, ఐటీఐ, అప్రెంటిస్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలపై సమీక్ష



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న వీసీ

ఏయూక్యాంపస్: రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ఉన్నత విద్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామల రావు ఆన్‌లైన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సీడీసీ డీన్ ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణ రెడ్డిలు పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల్లో ప్రవేశాల ప్రక్రియ, కళాశాలల తనిఖీలు, వసతులు పరిశీలన, అనుమతులు, ఎఫిలియేషన్ల జారీ తదితర అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయాల అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. రెండు వారాల్లోగా వీటిని పూర్తిచేయాలని తెలిపారు. ఉన్నత విద్య మండలి ఉపాధ్యక్షుడు ఆచార్య కె.రామమోహన రావు నిర్వహించిన మరొక సమీక్ష సమావేశంలో ఏయూ అధికారులు పాల్గొన్నారు.

మూడు స్కూల్ బస్సులపై కేసులు



కళాశాల బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు రెండో రోజు శుక్రవారం దాడులు కొనసాగించారు. మద్దిలపాలెం, బోయపాలెం, గాజువాక ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లేని మూడు బస్సులపై కేసులు నమోదు చేశారు. రెండు రోజుల్లో 10 బస్సులపై కేసులు నమోదు చేయగా ఒక బస్సును సీజ్ చేశారు. కళాశాల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం హెచ్చరించారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో, ఆటోల్లో ఎక్కించకూడదని తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు మన్మోహన్, సుధీర్, సుమన్ కుమార్, లలిత శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో రోజు వారి ఉల్లి వినియోగం **70** టన్నులు | రైతు బజార్లకు సరఫరా **25** టన్నులు | రిటైల్ ధర కిలో రూ.**50**



ఉల్లికిపాటు

- కూరగాయలదీ అదే దారి
- టమాటా కిలో రూ.60

సాక్షి, విశాఖపట్నం: ఉల్లిపాయలతో పాటు కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ఇవి సామాన్యుడికి అందనంత ఎత్తులో విహరిస్తున్నాయి. రోజురోజుకూ వీటి ధరలు పెరుగుతూ కొనాలంటేనే జనం భయపడే పరిస్థితులొచ్చాయి. ఉల్లి, కాయగూరల ధరలు అడ్డూ అదుపు లేకుండా పరుగులు పెడుతుండడంతో ముమ్ముందు ఇంకెంతగా ఎగబాకుతాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నెల రోజుల క్రితం వరకు కిలో రూ.20కి మించని ఉల్లి క్రమంగా రూ.25కి చేరుకుంది. అలా పెరుగుతూ ఇప్పుడు రైతు బజారులో రూ.35కి, రిటైల్ మార్కెట్‌లో రూ.50కి చేరింది. ఉల్లిపాయలు అధికంగా కర్నూలు, మహారాష్ట్ర నుంచి వస్తుంటాయి. ప్రస్తుతం మహారాష్ట్రలో వర్షాభావ పరిస్థితులతో ఉల్లి ఉత్పత్తి ఆశాజనకంగా లేదు. దీంతో అక్కడ వ్యాపారులు నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని చెబుతున్నారు. అలాగే కర్నూలులో ఉల్లి పంట చేతికి రావడానికి మరో రెండు నెలలైనా పడుతుందని అంటున్నారు. అందువల్ల వినియోగానికి సరిపడినంత ఉల్లిపాయలు లభ్యం కాకపోవడంతో వీటి ధర పెరుగుతూ వస్తోంది. ఉల్లి అంటేనే ఉలిక్కిపడే స్థాయికి చేరుకోనుంది. రానున్న రోజుల్లో ఉల్లి రేటు మరింత పెరగవచ్చని, ఆగస్టు వరకు పెరుగుదల కొనసాగవచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో రాయితీపై ఉల్లిని సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

తారెత్తిస్తున్న టమాటా..

మరోవైపు టమాటా ధరలు తారెత్తిస్తున్నాయి. నెల క్రితం కిలో రూ.20కి మించని వీటి ధర ప్రస్తుతం రూ.60కి పైనే ఉంది. కూరల్లో రుచి కోసం టమాటాలను విరివిగా వాడుతుంటారు. దీంతో వీటికి అలవాటు పడిన వారు ధర పెరిగినా ఎంతో కొంత కొనుగోలు చేస్తున్నారు. టమాటా పంట ఎక్కువగా రాయలసీమలోని మదనపల్లి, పుంగనూరు, బెంగళూరు శ్రీనివాసపురం ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి తెస్తుంటారు. గతంలో మండుటెండలు, వడగాడ్పులు, ప్రస్తుతం వర్షాల వల్ల అక్కడ టమాటా పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని, దీంతో రేట్లు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పైగా ఈ టమాటాలు అంత నాణ్యంగానూ ఉండడం లేదు. ప్రస్తుత పరిస్థితిని బట్టి రానున్న రోజుల్లో వీటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని టమాటా వ్యాపారి జూరెడ్డి శ్రీనివాసరావు 'సాక్షి'కి చెప్పారు.



కోరలు చాస్తున్న కూరగాయలు

ఇక కూరగాయల ధరలు కోరలు చాస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం అందుబాటులో ఉన్న వీటి రేట్లు ఇప్పుడు అదుపు తప్పుతున్నాయి. కారుచౌకగా దొరికే దొండకాయలు, బెండకాయలు, వంకాయలు, బరబాటీలు వంటివి కూడా కొండెక్కి కూర్చున్నాయి. రిటైల్ మార్కెట్లో కిలో దొండ రూ.40, బెండ రూ.50, వంకాయలు రూ.30, బీరకాయలు రూ.60, కాకరకాయలు రూ.55, బరబాటీ రూ.70, బంగాళాదుంపలు రూ.40, చిక్కుడు రూ.90, ఆగాకర రూ.100, అల్లం రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. విశాఖ రైతు బజార్లలో కిలోపై రూ.5–15 తక్కువగా అమ్ముతున్నారు. అయినప్పటికీ సామాన్య, ప్రజానీకానికి ఈ ధరలు ఎంతో భారంగా పరిణమిస్తున్నాయి. దీంతో ఇన్నాళ్లూ కిలో కొనుగోలు చేసిన వారు అరకిలో, అరకిలో కొనే వారు పావు కిలోకు పరిమితమవుతున్నారు.

రిటైల్ మార్కెట్, రైతుబజార్లలో ధరలు (కిలో రూ.లలో)

కూరగాయల రకం	రిటైల్	రైతుబజార్
ఉల్లిపాయలు	50	35
టమాటా	60	50
వంకాయలు	30	22
బెండకాయలు	50	40
దొండకాయలు	40	32
బీరకాయలు	60	48
కాకరకాయలు	55	48
క్యాబేజి	35	28
క్యారెట్	45	38
బంగాళాదుంపలు	40	32
దేవుడు చిక్కుడు	90	84
బీట్‌రూట్	40	32
అల్లం	200	175
పచ్చిమిర్చి	60	52
ఆగాకర	100	90
బరబాటి	70	60
బీన్స్	80	70



పీఎం సూర్యఘర్ పరిమితులు సులభతరం

- మరింత మందికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చర్యలు
- ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ మహేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం : ఇంట్లోనే సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం పరిమితులను మరింత సులభతరం చేసిందని ఈపీడీసీఎల్ విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ ఎల్ మహేంద్రనాథ్ తెలిపారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో మరింత మందికి లబ్ధి చేకూరేలా అర్హతలను సవరణ చేశారని వివరించారు. గతంతో దరఖాస్తుదారుని వార్షికవేతనం రూ.1.5లక్షలు కంటే తక్కువ ఉండాలనే నిబంధనను ఎత్తివేస్తూ.. ఎవరైనా దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కొత్త నిబంధనల మేరకు 10 కిలోవాట్ల లోపు లోడ్‌కి డిస్కమ్ అనుమతులేవీ అవసరం లేదని, అదేవిధంగా 10కిలోవాట్ దాటిని వారికి సీఈఐజీ అనుమతి కాకుండా సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని వివరించారు. గతంలో 21 ఏళ్లు నిండిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండేదని, ఇప్పుడు దరఖాస్తుదారుడు రిజిస్టర్డ్ విద్యుత్ వినియోగదారుడైతే చాలని వయసుతో సంబంధం లేదని ఎస్ఈ మహేంద్రనాథ్ స్పష్టం చేశారు. కొత్త నిబంధనలను పరిగణనలోకి తీసుకొని విశాఖ సర్కిల్ పరిధిలో ఉన్న వినియోగదారులంతా సూర్యఘర్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటిపైనే సౌర విద్యుత్ ఉత్పత్తితో అనేక లాభాలు పొందేలా ప్రయోజనాలుంటాయని ఎస్ఈ తెలిపారు.

జీతాలివ్వకుండా టూర్లకు ఎలా పంపుతారు?

స్టీల్‌ప్లాంట్ నిర్ణయంపై విమర్శలు

గాజువాక : ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని యాజమాన్యం కొంత మందిని అనవసర టూర్లకు పంపడానికి ఉత్తర్వులు ఇవ్వడం స్టీల్‌ప్లాంట్‌లో చర్చనీయాంశమైంది. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన ఈ టూర్లను ఆర్థిక పరిస్థితి బాగాలేని పరిస్థితుల్లో యాజమాన్యం జారీ చేసిన తీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు 36 మందిని షిల్లాంగ్‌కు 'మేనేజ్‌మెంట్ ఆఫ్ సేఫ్టీ, హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఎట్ వర్క్‌ప్లేస్' అనే ప్రోగ్రాంకు ఈనెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల టూర్‌కు అనుమతిస్తూ హెచ్‌ఆర్‌డీ విభాగం ఈనెల 10న ఉత్తర్వులు జారీ చేసింది. విమాన ప్రయాణం తప్ప ఇతర మార్గాలు లేని ఈ టూర్‌కు లక్షల్లో ఖర్చవుతుంది. తమకు బిల్లులు ఇవ్వకపోతే ఈనెల 15 నుంచి క్యాంటీన్లు నిలిపివేస్తామని కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేసిన నేపథ్యంలో ఇటువంటి టూర్లు అవసరమా అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

విమల విద్యాలయంపై కొనసాగుతున్న చర్చలు

నేడు ఉపాధ్యాయులతో సమావేశం

ఉక్కునగరం : స్థానిక విశాఖ విమల విద్యాలయంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. నాయకుల విజ్ఞప్తి మేరకు విద్యార్థులను పాఠశాలకు అనుమతించినా ఉపాధ్యాయులను తరగతులకు పంపలేదు. మరోవైపు వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు పాఠశాల సందర్శించి మూసివేత తగదని పేర్కొన్నారు.

ఈ అంశంపై ఉక్కు యాజమాన్యం ప్రతినిధులతో జరిగిన చర్చల్లో కొంత మేర పురోగతి కనిపించినప్పటికీ శనివారం పాఠశాలలో జరగనున్న చర్చలు కీలకం కానున్నాయి. పాఠశాల మూసివేతఅంశం తెలిసి బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, టీడీపీ నాయకులు, కార్పొరేటర్ బి.గంగారావు, ఉక్కు కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ తదితరులు ఉదయం పాఠశాలకు వచ్చి సంఘీభావం తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యమే జీతాలు చెల్లించాలంటూ ఉపాధ్యాయులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం వారు ఉక్కు పరిపాలన భవనంలో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం మధుసూధనరావు, ఎన్.భానులతో సమావేశమయ్యారు. పాఠశాలను కొనసాగిస్తామని, ప్లాంట్ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యామ్నాయ ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలని జీఎంలు కోరారు. దీంతో పాఠశాల యాజమాన్యం ప్రతినిధి థామస్ పుకిల్ పాఠశాలలో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యంతో శనివారం సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులకు వివిధ సంఘాల మద్దతు

22న చదరంగం పోటీలు

విశాఖ స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి డీఆర్ఎం కప్ చదరంగం పోటీలు రెండు రోజుల పాటు శ్రీనివాస కళ్యాణ మండపంలో జరగనున్నాయి. ఈకోర్‌రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్, క్రీడాధికారి ప్రవీణ్‌భాటి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొని చాంపియన్‌షిప్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు.



పోస్టర్ విడుదల చేస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులతో నిర్వాహకులు

విశాఖ స్పోర్ట్స్ : చిన్నారుల వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో 18 ఏళ్ల నుంచి 14 ఏళ్ల లోపు వారికి ఈ శిబిరాలు నిర్వహించారు. రెగ్యులర్ కోచింగ్, ఆరోగ్యకరమైన జీవనశైలిని ఏర్పర్చుకునే దిశగా చిన్నారులు అడుగులు వేసేందుకు ఈ శిబిరాలు తోడ్పడ్డాయి. అథ్లెటిక్స్‌తో పాటు ఆర్చరీ, బాక్సింగ్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్ తదితర 14 అంశాల్లో కోచ్‌ల పర్యవేక్షణలో శిబిరాలు నెలరోజుల పాటు నగరంలోని పలు కేంద్రాల్లో శిబిరాలు నిర్వహించారు.

సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో 1,544 ఖాళీలు

ఎంవీపీకాలనీ: జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాల్లో 1,544 ఖాళీలు ఉన్నట్లు ఆశాఖ ఉపసంచాలకుల కార్యాలయం తెలిపింది. 2023–2024 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపింది. జిల్లాలో ఉన్న 8 ప్రీమెట్రిక్, 14 పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రీమెట్రికల్‌లో 4 బాలుర, 4 బాలికల వసతిగృహాల్లో 872 మందికి ప్రవేశాలు కల్పించనుండగా పోస్ట్ మెట్రిక్‌లో 7 బాలుర, 7 బాలికల వసతిగృహాల్లో 672 మందికి ప్రవేశాలు కల్పించనున్నారు. మొత్తంగా 1,544 మంది విద్యార్థులకు ఆయా వసతిగృహాల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆ శాఖ ఉపసంచాలకుడు కె.రామారావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు రోస్టర్ ఆధారంగా ఈ ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ప్రవేశాలకు విశాఖ ఎంవీపీకాలనీ సెక్టార్–9లోని సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకుల కార్యాలయంతో పాటు భీమిలిలోని సహాయ సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయాన్ని విద్యార్థులు సంప్రదించాలని సూచించారు.

మా రూటే సెపరేటు..!

- ప్రైవేటు'లో సొంత పుస్తకాలు
- ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల కొనుగోలుకు నిరాసక్తత
- విద్యార్థులకు ఆర్థిక భారమవుతున్న ప్రైవేటు చదువులు
- స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలు
- ఉమ్మడి విశాఖలో 1,436 ప్రైవేటు స్కూళ్లు

విశాఖ విద్య: ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ద్వారా ముద్రించిన పాఠ్యపుస్తకాలనే వినియోగించాలనే నిబంధనలకు తూట్లు పడుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న ప్రైవేటు స్కూళ్లకు ఏటా ఎంపిక చేసిన ఏజెన్సీల ద్వారా పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తుంటారు. ఇందుకోసం పాఠశాల యు–డైస్ కోడ్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతుల వారీగా ఎంతమంది విద్యార్థులు ఉన్నారు..? వారికి కావాల్సిన పాఠ్యపుస్తకాల వివరాలను ఆయా ప్రైవేటు యాజమాన్యాలు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో 1,436 ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమైన వేళ స్కూళ్లలో అడ్మిషన్ల ప్రక్రియ జోరందుకుంది. విద్యార్థులు అడ్మిషన్లు తీసుకునే సమయంలోనే ప్రైవేటు యజమాన్యాలు పుస్తకాలు, యూనిఫారాలు వంటి వాటిని తమ వద్దనే కొనాలనే ఒత్తిడి చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు.

సొంత పుస్తకాలు వీల్లేదు

ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లల్లో తప్పనిసరిగా ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన పాఠ్యపుస్తకాలతోనే బోధన సాగాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఎస్‌సీఈఆర్‌టీ తయారు చేసిన ప్రశ్నా పత్రాలతోనే పరీక్షలన్నీ నిర్వహించనున్నారు. అయితే కొన్ని కార్పొరేట్ స్కూళ్లల్లో ఎస్‌సీఈఆర్‌టీ సిలబస్ కాకుండా, తమ సొంత సిలబస్‌తో పుస్తకాలను ముద్రించి, వాటిని విద్యార్థులతో కొనుగోలు చేయిస్తున్నారు. వీటి కోసమని ఎంతలేదన్నా రూ.10 వేలు వరకు చెల్లించాల్సి వస్తోందని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు.



ఓ ప్రైవేటు స్కూల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుస్తకాలు

స్కూళ్లలోనే పుస్తకాల వ్యాపారం

పాఠ్యపుస్తకాలను నిర్ణీత ధరలకే విక్రయించేలా గతేడాది విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. 1వ తరగతి రూ.399లు, రెండో తరగతి రూ.425లు, మూడో తరగతి రూ.675లు, నాల్గో తరగతి రూ.702లు, 5వ తరగతికి రూ.727లు, 6వ తరగతికి రూ.747లు, 7వ తరగతి రూ.871లు, 8వ తరగతి రూ.1,181లు, 9వ తరగతికి రూ.1,167లు, పదో తరగతికి రూ. 859లు గా నిర్ణయించారు. ఈ ఏడాది దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత లేకపోవటంతో ప్రైవేటు యాజమాన్యాలు స్కూళ్లలోనే పుస్తకాల వ్యాపారానికి తెరలేపారు.

అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు

ప్రైవేటు స్కూళ్లల్లో విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజులపై విద్యాశాఖ నియంత్రణ లేకపోవటంతో పేద,మధ్య తరగతి వారికి తీవ్రమైన ఆర్థిక భారమవుతోంది. ప్రైవేటు స్కూల్ మోజుతో అడ్మిషన్ల కోసమని వస్తే యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ నగరంలో డిమాండ్ ఉన్న కొన్ని స్కూళ్లలో ఒకటో తరగతికి రూ.40 నుంచి 50 వేలు వరకు అదే పదో తరగతికి అయితే రూ.70 వేలు నుంచి రూ.1 లక్ష వరకు కూడా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకే ఫీజుల వసూలు చేయాలి. అది కూడా ఎంత వసూలు చేయాలనేది పాఠశాల ప్రాంగణాల్లోని బోర్డులపై అందరికీ కనిపించేలా రాయాలి. కానీ విశాఖ నగరంలోని పాఠశాలల్లో ఇవేమీ కనిపించటం లేదు. దీనిపై జిల్లా కలెక్టర్ స్థాయిలో సత్వరమే స్పందించి, అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని వారు కోరుతున్నారు.

సొంత పుస్తకాలు విక్రయిస్తే చర్యలు



ప్రైవేటు స్కూళ్లలోనూ తప్పనిసరిగా ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ముద్రించిన పాఠ్యపుస్తకాలతోనే చదువులు సాగాలి. అలా కాకుండా ఎక్కడైనా సొంత పుస్తకాలు ముద్రించి విక్రయించినట్లుగా కానీ, వాటితో బోధన చేస్తున్నట్లు తెలిస్తే అలాంటి పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల వారంతా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాల కోసం వెంటనే నివేదికలు సమర్పించాలి. దీనిపై పర్యవేక్షణ చేసేలా డీఈవోలకు ఆదేశాలు ఇచ్చాం.

– బి. విజయ భాస్కర్, రీజినల్ జాయింట్ డైరెక్టర్

క్యాన్సర్ విజేతలకు అభినందన

ఆరిలోవ: హెల్త్ సిటీ అపోలో ఆస్పత్రిలో శుక్రవారం క్యాన్సర్ విజేతలకు అభినందన సభ నిర్వహించారు. మొదటి దశ నుంచి ప్రమాదకరమైన స్థితిలో క్యాన్సర్‌తో బాధపడుతున్నవారికి ఇక్కడ వైద్యులు అందించిన చికిత్సతో కోలుకొని పలువురు విజేతలుగా నిలిచారు. వారితో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి అపోలో సీవోవో శ్రీరామచంద్ర పర్యవేక్షణలో అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ఏ సెలబ్రేషన్ ఆఫ్ క్యాన్సర్ సర్వైవర్స్ (ట్రైంఫ్ టుగెదర్)' పేరుతో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొన్నాళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతూ పూర్తిగా కోలుకున్న వారు తమకు అందిన వైద్య సేవలు గురించి తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశాఖ క్రైం డీసీపీ పి.వెంకటరత్నం పాల్గొని విజేతలను అభినందించారు. అంకాలజీ వైద్యులు రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదకరమైన క్యాన్సర్ కూడా నయమవుతుందన్నారు. క్యాన్సర్ వచ్చిన మొదటి దశలోనే వైద్యులను సంప్రదిస్తే మంచి ఫలితం లభిస్తుందన్నారు. అనంతరం క్యాన్సర్ విజేతలు పలు వేషధారణలో నృత్యం చేసి అలరించారు. కార్యక్రమంలో డాక్టర్ సుమన్ దాస్, డాక్టర్ చంద్ర కల్యాణ్, డాక్టర్ ఆదిత్య నారాయణ, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ జయశ్రీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బాలకృష్ణ, డీజీఎం విజయసారథి, హెచ్‌వోడీ సత్య పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్య హోమం

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం ఆయుష్య హోమం నిర్వహించారు. అమ్మవారి జన్మ నక్షత్రం (ఉత్తరా నక్షత్రం)పురస్కరించుకొని ఉదయం 8 గంటలకు నిర్వహించిన ఈ హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉదయం 8 గంటలకు నిర్వహించే ఆయుష్య హోమంలో పాల్గొనదలచే భక్తులు రూ.2,516 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు, అకౌంట్ నెంబరు 060810011006691కు జమ చేయాలి. మరిన్ని వివరాలకు 0891-2566514, 8985515989 నంబరులో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వి.రాంబాబు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశాలకు మార్గదర్శక పరీక్ష

సీతంపేట: సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఈ నెల 16న ఉదయం 10 గంటలకు అక్కయ్యపాలెంలోని తమ సంస్థ కార్యాలయంలో సామర్థ్యాలపై అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్టు విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంపిటీషన్స్ డైరెక్టర్ బి.వి.కె.బాబ్జీ తెలిపారు. 4, 5, 6 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కావచ్చన్నారు. అర్థమెటిక్ ఎబిలిటీ, ఫండమెంటల్ ఆపరేషన్స్ ఆఫ్ అర్థమెటిక్స్‌లో విద్యార్థుల వేగం, కచ్చితత్వం అంచనా వేయడానికి ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 99488 41652కు సంప్రదించాలని సూచించారు.

చింత చిగురు.. నోరూరు

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

- చింత చిగురుకు యమ డిమాండ్
- పుష్కలంగా పోషకాలు
- కిలో ధర రూ. 500



సీతమ్మధార రైతు బజార్‌లో చింత చిగురు విక్రయిస్తున్న మహిళా రైతు చెల్లాయమ్మ

సీతమ్మధార: ఆరోగ్యమే మహా భాగ్యం అన్నారు మన పెద్దలు.. ఆరోగ్యానికి దోహదం చేసే వాటిలో చింత చిగురు ఒకటి కావడం విశేషం. నోటికి పుల్లడి రుచి ఇస్తూనే.. తినేకొద్దీ తినాలనిపిస్తుంది చింత చిగురు. ఏటా వేసవిలో మాత్రమే లభ్యమయ్యే చింత చిరుగుకి ఎంతో డిమాండ్ ఉంది. నగరంలోని సీతమ్మధార రైతుబజార్‌లో చింత చిగురు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ కిలో ధర రూ.500గా ఉంది. చింత చిగురును రొయ్యలు, చేపలకు దట్టిస్తే.. ఇక భోజన ప్రియులకు పండగే. అలాగే కోడిమాంసం, వేటమాంసంతో కూడా కలిపి దీనిని వండుకుంటారు.

పెందుర్తి, సబ్బవరం, కె.కోటపాడు, ఆనందపురం, దేవరాపల్లి, పాయకరావుపేట, అనకాపల్లి, పరవాడ, తదితర మండలాల నుంచి రైతులు చింతచిగురు తీసుకువస్తారు. వారంలో మూడు రోజులు ఈ ప్రాంతాల నుంచి రైతులు రోజుకి కిలో చొప్పున చింత చిగురు తెచ్చి విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో చింత చిగురు కిలో ధర రూ.800 పైమాటే. చింత చిగురులో మంచి పోషక విలువలు వుండడంతో బజారులో డిమాండ్ అధికంగా ఉంటుంది. ఏటా చైత్రమాసం దాటిన తర్వాత చింత చిగురు దిగుబడి అందుబాటులోకి వస్తుంది. చింత చెట్ల సంఖ్య ఏటా తగ్గిపోవడంతో దిగుబడి కూడా తగ్గుతోందని రైతులు చెబుతున్నారు. చింత చిగురును ఇటు శాఖాహార, అటు మాంసాహార వంటకాల్లో కలిపితే ఆ రుచే వేరు. ఆరోగ్యానికి దోహదం చేసే ఎన్నో రకాల పోషకాలు ఉన్నాయి. వంద గ్రాముల చింతచిగురులో 5.8 గ్రాముల ప్రొటీన్లు, వంద మిల్లీ గ్రాముల కాల్షియం, 10.06 గ్రాముల పీచు, 140 మిల్లీగ్రాముల ఫాస్పరస్, 26 మిల్లీగ్రాముల మెగ్నీషియం, 3 మిల్లీ గ్రాముల విటమిన్ సి ఉంటాయి.

లాభాలెన్నో..

చింత చిగురులో ఉన్న ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో చెడు కొలెస్టరాల్ స్థానంలో మంచి కొలెస్టరాల్‌ని పెంచుతాయి. శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. చింత చిగురు ఉడికించిన నీటిని పుక్కలిస్తే గొంతునొప్పి, మంట, వాపు, నోటి పూత వంటివి తగ్గుతాయి. ఇందులో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. మలబద్ధకం నివారణలో దోహదం చేస్తుంది. పైల్స్ నివారణకు కూడా ఉపయోగపడుతుంది. వైరల్ జ్వరాలను ఇట్టే అరికడుతుంది. గుండె జబ్బుల నివారణకు దోహదపడుతుంది. నులిపురుగుల నివారణ ఔషధంగా ఉపయోగపడుతుంది. రోగ నిరోధక శక్తి పెంచుతుంది. ఎముకల పటుత్వానికి, థైరాయిడ్ నివారణకు ఉపయోగపడుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో సుగర్ లెవెల్స్ తగ్గిస్తుంది. మలేరియా, కీళ్లవాపుల నివారణకు ఉపయోగపడుతుంది. ఇంకా తల్లి పాలను వృద్ధి చేస్తుంది.



సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న చింతచిగురు

తగ్గిన చింత చెట్లు

గ్రామీణ ప్రాంతాల్లో చింతచిగురు విస్తారంగా పండుతుంది. పట్టణాల్లో వీటికి మంచి డిమాండ్ ఉంది. కానీ ఏటా చింత చెట్ల సంఖ్య తగ్గిపోవడంతో దిగుబడులు కూడా గణనీయంగా తగ్గిపోతున్నాయి. వారంలో మూడు రోజుల పాటు కిలో వంతున చింత చిగురు తెచ్చి విక్రయిస్తున్నా..

– అప్పారావు, కె.సంతపాలెం



పెరిగిన డిమాండ్



చింత చిగురును పలురకాల శాఖాహార, మాంసాహార వంటకాల్లో వినియోగిస్తారు. దీంతో పట్టణాల్లో చింత చిగురుకి మంచి డిమాండ్ ఉంది. చింత చిగురు ఆరోగ్యానికి మంచిదని వినియోగదారుల నమ్మకం.

– బి.దేవుడమ్మ, తవ్వవానిపాలెం

స్టూడెంట్ బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు

అల్లిపురం: విద్యా సంస్థలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎ.అప్పలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు https:// online. apsrtcpass. in లో వివరాలు నమోదు చేసుకుని.. ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. తర్వాత అప్లికేషన్ ఫారంను ప్రింట్ తీసుకుని.. దానిని సంబంధిత విద్యా సంస్థ ప్రిన్సిపాల్/హెచ్‌ఎంలతో ధ్రువీకరణ చేయించాలన్నారు. ఆ అప్లికేషన్ ఫారంతో పాటు ఆధార్, 10వ తరగతి పాసైన విద్యార్థులు మార్కుల జాబితా జిరాక్స్ కాపీలు, ఫోన్ నంబర్‌ను జత చేసి సంబంధిత బస్ స్టేషన్లలో అందజేయాలన్నారు.

విద్యా సంస్థలకు సూచనలు

తరగతుల వారీగా అడ్మిషన్ జాబితాను ప్రిన్సిపాల్/హెచ్‌ఎం సంతకంతో సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలని రీజనల్ మేనేజర్ సూచించారు. అలా చేయని విద్యా సంస్థలకు పాసులు జారీ చేయమని స్పష్టం చేశారు. విద్యార్థుల జాబితా డిపోలకు అందజేయాల్సిన బాధ్యత విద్యాసంస్థలదేనన్నారు. 12 ఏళ్లలోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికల(10వ తరగతి వరకు)కు ఉచిత బస్ పాస్, స్టూడెంట్ జనరల్ బస్ పాస్(ఇయర్లీ), స్టూడెంట్ జనరల్ బస్ పాస్ (క్వార్టర్లీ), స్టూడెంట్ జనరల్ బస్ పాస్ (మంత్లీ), స్టూడెంట్ గ్రేటర్ విశాఖ పాస్, స్టూడెంట్ రూట్ పాస్, జేవోసీ పాస్ కావాలనుకునే విద్యార్థులు సంబంధిత బస్ స్టేషన్(ద్వారకా, ఎంవీపీ, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, మధురవాడ, కూర్మన్నపాలెం)లకు వెళ్లి అప్లికేషన్ పరిశీలన చేయించుకోవాలన్నారు. అనంతరం కౌంటర్లలో నేరుగా బస్ పాస్ పొందవచ్చని వెల్లడించారు.

ఇంటర్నేషనల్ స్కూలింగ్ పూర్తి చేసిన గురుకుల విద్యార్థిని

- అమెరికా నుంచి తిరిగి రాక

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల ప్రతిభా పాఠశాలకు చెందిన రోడా ఇవాంజలిన్ ఏడాది పాటు అమెరికాలో ఇంటర్నేషన్ స్కూలింగ్‌ను పూర్తి చేసుకుని తిరిగి గురుకులానికి చేరుకుంది. ఈ సందర్భంగా గురుకులంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గురుకుల సమన్వయకర్త ఎస్. రూపావతి ఆమెను అభినందించారు. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో కెన్నెడీ లుగర్ యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రామ్‌కు భారత్ నుంచి 25 మంది వెళ్లారు. ఇందులో ఏపీ నుంచి ఇద్దరు ఎంపిక కాగా.. కొమ్మాది గురుకులానికి చెందిన ఇవాంజలిన్ ఒకరు. ఏడాది స్టడీ టూర్‌లో భాగంగా గత ఏడాది మేలో ఈ విద్యార్థిని అమెరికా వెళ్లారు. అక్కడ అమెరికన్ ఇంటర్నేషనల్ స్కూలింగ్ కోర్సు పూర్తి చేసుకుని వచ్చిన ఆమె.. అక్కడ అనుభవాలు తోటి విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.నాగమణి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇవాంజలిన్‌ను అభినందిస్తున్న డీసీవో రూపావతి, విద్యార్థులు

ఏయూలో అమెరికన్ ఎంబసీ అధికారులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికన్ ఎంబసీ అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. న్యూఢిల్లీలోని అమెరికన్ ఎంబసీ మినిస్టర్ కౌన్సిలర్ ఫర్ పబ్లిక్ డిప్లమసీ గ్లోరియా ఎఫ్ బెర్బెనా, హైదరాబాద్‌లోని అమెరికన్ ఎంబసీ ప్రజా సంబంధాల అధికారి అలెగ్జాండర్ మాక్లారెన్ ముందుగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. ఏయూలోని అమెరికన్ కార్నర్ అందిస్తున్న సేవలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలపై చర్చించారు. అమెరికన్ కార్నర్ ఆరంభం నుంచి నిర్వహించిన కార్యక్రమాలు, సదస్సులను వీసీ వారికి వివరించారు. అనంతరం అమెరికన్ కార్నర్‌ను ఎంబసీ అధికారులు పరిశీలించారు. ఏయూ నిర్వహిస్తున్న విధానం పట్ల ప్రశంసలు అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి భాగంలో గుచ్చుకున్న కర్ర ముక్క

- విజయవంతంగా తొలగించిన కేజీహెచ్ వైద్యులు



వైద్యులు తొలగించిన కర్ర ముక్క



కంటి భాగంలో గుచ్చుకున్న కర్ర ముక్క



పూర్తిగా కోలుకున్న నాగేశ్వరరావుతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 39 ఏళ్ల యువకుడి కంటికి, కనుబొమ్మకు మధ్య భాగంలో గుచ్చుకున్న కర్ర ముక్కను తొలగించి.. తిరిగి కంటి చూపును తీసుకొచ్చారు. ప్రస్తుతం రోగి పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. వివరాలివీ.. నర్సీపట్నం మండలం గురధరపాలెం గ్రామానికి చెందిన మీసాల నాగేశ్వరరావు ఈ నెల 4 రాత్రి 9.30 గంటల సమయంలో తన ఇంటి మొదటి అంతస్తు పైనుంచి జారిపడిపోయాడు. ఈ ఘటనలో 12 సెం.మీ సరుగుడు కర్ర ముక్క తన కుడి కంటికి, కనుబొమ్మ మధ్య భాగంలోకి చొచ్చుకుపోయింది. ఈ నెల 5న అతన్ని కేజీహెచ్‌కు తీసుకురాగా.. కంటి, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, మత్తు వైద్యులు సమన్వయంతో ఈ నెల 6న న్యూరో సర్జరీ ఆపరేషన్ థియేటర్‌లో శస్త్ర చికిత్స నిర్వహించారు. అనంతరం సరుగుడు కర్ర ముక్కను తొలగించారు. శస్త్ర చికిత్స అనంతరం రోగికి హయ్యర్ యాంటీ బయాటిక్స్ ఇచ్చారు.

అనంతరం ఐసీయూలో వైద్య సేవలందించారు. ప్రతీ క్షణం పర్యవేక్షించడంతో రోగి పూర్తిగా కోలుకున్నాడు. శస్త్ర చికిత్స సమయంలో కన్ను, కంటి నరాలు, మెదడు కింద ఉన్న రక్తనాళాలు, నరాలు జాగ్రత్తగా వేరు చేసి ఆ సరుగుడు కర్ర ముక్కను తొలగించారు. ఆ తర్వాత మళ్లీ పరీక్షలు నిర్వహించారు. దీంతో కంటి చూపు కూడా తిరిగి వచ్చింది. న్యూరో సర్జరీ డాక్టర్ హయగ్రీవరావు, అనస్థీషియన్లు డాక్టర్ రవి, డాక్టర్ శ్రీ లక్ష్మి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ కల్యాణి, డాక్టర్ దక్షిణామూర్తి, ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ మురళీకృష్ణ, స్టాఫ్ నర్స్ సత్యవతి, సిబ్బంది సమష్టిగా పని చేయడం వల్ల రోగి పూర్తిగా కోలుకున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

అట్టలే.. పట్టు పాన్పులు!



ఆకలి రుచి ఎరుగదు.. నిద్ర సుఖమెరుగదు అన్నట్టుగా.. కాయకష్టం చేసి అలసి సొలసిన ఈ కూలీలు తాము లోడింగ్ చేసిన అట్టలనే పట్టు పానుపు చేసుకున్నారు. బయట ఎండకు భయపడి చెట్టు నీడన ఆపిన వ్యాను పైనే సేదతీరారు. హాయిగా కాసేపు కునుకు తీశారు. నగరంలోని చినవాల్తేరు రోడ్డులోని ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం

ఆలస్యంగా సంత్రగచ్చి-బెంగళూరు స్పెషల్

తాటిచెట్లపాలెం: సంత్రగచ్చిలో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు (08845) సమ్మర్ స్పెషల్ సుమారు 12.30 గంటలు ఆలస్యంగా శనివారం ఉదయం 7.30 గంటలకు బయల్దేరింది. లింక్ రైలు ఆలస్యంగా చేరుకున్నందున.. ఈ రైలు ఆలస్యంగా బయలుదేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

చెన్నై- సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై-సంత్రగచ్చి-చెన్నై మధ్య సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి(06007) ప్రత్యేక రైలు శుక్రవారం రాత్రి 9 గంటలకు బయలుదేరగా.. శనివారం మధ్యాహ్నం 1.54 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.59 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.15 గంటలకు సంత్రగచ్చి వెళ్తుంది. సంత్రగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(06007) స్పెషల్ జూన్ 16వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు సంత్రగచ్చిలో బయలుదేరి.. మధ్యరాత్రి 1.48 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 1.50 గంటలకు బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం 3.50 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

లలితాపీఠంలో కుర్తాళం పీఠాధిపతి



లలిత పీఠానికి చేరుకున్న కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి

సీతంపేట: కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి సుమారు ఐదు నెలల తర్వాత అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితాపీఠానికి విచ్చేశారు. పండితులు వేదమంత్రాలు, పూర్ణకుంభంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన పీఠం పురోహితులను ఆశీర్వదించారు. చాలా రోజుల తర్వాత స్వామీజీ పీఠానికి విచ్చేయడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి దర్శనం కోసం వచ్చారు. పీఠం దర్బార్ హాలులో స్వామీజీ కాసేపు కూర్చుని భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెలాఖరు వరకు స్వామీజీ పీఠంలో ఉంటారని, విశేష పూజా, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొంటారని మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. స్వామీజీని కలవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని, ఇందుకోసం 98492 86779ను సంప్రదించాలని సూచించారు.

19 నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

మహారాణిపేట: జర్నలిస్టులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ నెల 19 నుంచి ఆరిలోవలోని అపోలో ఆస్పత్రిలో జర్నలిస్టులతో పాటు వారి జీవిత భాగస్వామికి కూడా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24లో అక్రిడిటేషన్ కలిగిన జిల్లాలోని జర్నలిస్టులందరి వివరాలను అపోలో యాజమాన్యానికి పంపించినట్లు తెలిపారు. సంబంధిత జాబితాను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామని వెల్లడించారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు 19వ తేదీ నుంచి ఉదయం 8 నుంచి 9.30 గంటల మధ్యలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షల అనంతరం రిపోర్టులు వచ్చాక వైద్యుడిని సంప్రదించి చెకప్ కూడా చేయించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు 50 మందికి చొప్పున వైద్య పరీక్షలు జరుగుతాయని, జిల్లాలోని జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 17వ తేదీలోగా వైద్య పరీక్షలు చేసుకునే అక్రిడిటేషన్ జర్నలిస్టులు, వారి జీవిత భాగస్వామి ప్రాథమిక వివరాలను సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం/ పీఆర్వో కిశోర్‌కు 80086 56504లో తెలియజేయాలన్నారు.

32 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి గంజాయి రవాణా చేస్తున్న నిందితులను గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్, సీబీడీటీ బృందాలు శుక్రవారం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించాయి. ఒడిశాకు చెందిన సూర్‌జిత్ నాయక్, గౌతమ్ నాయక్, ప్రశాంత్ నాయక్ టికిరి స్టేషన్ నుంచి విశాఖపట్నం మీదుగా సికింద్రాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని.. రూ.1.61 లక్షల విలువైన 32.2 కేజీల గంజాయిని వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి.. రిమాండ్ నిమిత్తం తరలించినట్లు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు తెలిపారు.

గైస్‌లో శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మెషీన్



వెండింగ్ మెషీన్ ప్రయోజనాలు వివరిస్తున్న అధికారులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మెషీన్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. కాలేజీలో సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న 450 మంది బాలికలకు ఉపయోగపడే విధంగా ఈ మెషీన్‌ను అమెజాన్ ఇండియా, సి-3 ఇండియా (సెంటర్ ఫర్ క్యాటలైజింగ్ చేంజ్-3) సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఇందుకు అవసరమైన రూ.35,000లను ఈ సంస్థలు సమకూర్చాయి. గైస్ కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మెషీన్ వినియోగాలను సంస్థల ప్రతినిధులు బాలికలకు వివరించారు. అమెజాన్ ఇండియా సేఫ్టీ లాస్ ప్రివెన్షన్ మేనేజర్ రాజీవ్, టీమ్ లీడర్ నరేంద్ర, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ లెక్చరర్ వి.శ్రీకాంత్, సీ-3 సంస్థ ప్రగతి మిత్ర డి.పూర్ణానంద్ పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.71,890
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.65,900
వెండి(కిలో):	రూ.95,000

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	500.00
విజయనగరం	504.00
శ్రీకాకుళం	504.00

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.148
స్కిన్	: రూ.266
స్కిన్‌లెస్	: రూ.276